



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 255 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం గురువారం 23 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 255 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 23 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల..

### పిల్లలే మన ఆస్తి అన్న నారా లోకేశ్

- రాష్ట్ర వ్యాప్తంగా 42.70 లక్షల మంది తల్లులకు లబ్ధి
- రూ. 10,120.78 కోట్లను జమ చేయనున్న ప్రభుత్వం
- పిల్లల చదువులు కుటుంబానికి తరగని ఆస్తి అన్న లోకేశ్

- మిగతా 2లో




## ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..

### భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

- ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా



పెన్ పవర్ డెస్క్:ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు.మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు

- మిగతా 2లో



## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

### కుమారుడి ప్రమాద కేసులో కుట్ర ఆరోపణలు

- శ్రీకాకుళంలోని నివాసం నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఇంటి వద్ద వైకాపా కార్యకర్తలు చేరడంతో ఉద్రిక్తత
- కొడుకు చేసిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి
- కుమారుడిని కాపాడేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు
- మరో వ్యక్తిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారని అభియోగం
- బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని కేసు నమోదు


- మిగతా 2లో

### తమ్మినేని సీతారాంపై సమగ్ర

## విచారణకు ఆదేశించాం

- స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని దారుణాలకు ఒడిగట్టాడన్న అచ్చెన్నాయుడు
- బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్టు చిత్రీకరించారని మండిపాటు
- తప్పు చేసిన వారిని ప్రభుత్వం చట్టప్రకారం శిక్షిస్తుందని వ్యాఖ్య

- మిగతా 2లో



### మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు..

## భారీగా అభివృద్ధి చేస్తా

- మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పేదలకు శాశ్వత పట్టాల పంపిణీ
- ప్రజలిచ్చిన భారీ మెజారిటీతోనే అభివృద్ధి పనులు వేగవంతం చేశానన్న లోకేశ్
- మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్న మంత్రి
- రూ.1800 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- కేంద్ర నిధులతో ఎంపీ పెమ్మసాని సహకారంతో అభివృద్ధి పనులు

- మిగతా 2లో



### ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ షరతు..

## దీక్ష విరమణకు సిద్ధం

- ఆమరణ నిరాహార దీక్ష విరమించేందుకు సోనమ్ వాంగ్‌చుక్ సుముఖత
- నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలన్న షరతు
- నీట్ వివాదంపై జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలు

- మిగతా 2లో



### 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు..

## ఒక్కరికీ శిక్ష లేదు

- 7.5 కోట్ల విద్యార్థులు ప్రభావితమయ్యారని వ్యాఖ్య
- ఒక్క కేసులోనూ శిక్ష పడలేదని విమర్శ
- విద్యార్థుల డిమాండ్లు సమంజసమేనంటూ మద్దతు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ప్రధాని క్షమాపణ చెప్పాలని రాహుల్ పట్టు

- మిగతా 2లో



### పార్లమెంటులో నీట్‌పై చర్చిద్దాం..

## విపక్షాలకు కేంద్రం పిలుపు



- నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చకు సిద్ధమన్న కిరణ్ రిజిజు
- చర్చతోనే విద్యార్థుల్లో విశ్వాసం పెరుగుతుందని వ్యాఖ్య
- విపక్షాలు షరతులు విధిస్తున్నాయంటే చర్చను కోరుకోవడం లేదని అర్థమని వ్యాఖ్య

- మిగతా 2లో

## అలా చేస్తే బ్రిడ్జి లేదా పవర్ ప్లాంట్‌పై దాడి చేస్తాం



### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

- హర్ముజ్ జలసంధిలో ఓడలపై దాడి చేస్తే సహించబోమన్న ట్రంప్
- ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులు తప్పవని స్పష్టీకరణ
- ప్రపంచ చమురు రవాణాలో హర్ముజ్ జలసంధి అత్యంత కీలకం

పెన్ పవర్ డెస్క్:అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్ముజ్ జలసంధిలో ఎలాంటి దాడులకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ అటువంటి చర్యలకు దిగితే, ఇరాన్‌లోని వంతెనలను లేదా పవర్ ప్లాంట్‌లను ధ్వంసం


- మిగతా 2లో

## తెలంగాణలో మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు..

### వాతావరణ శాఖ హెచ్చరిక

- ఉత్తర తెలంగాణలో భారీ వర్షాల అవకాశం
- హైదరాబాద్‌లో పలుచోట్ల కుండపోత వర్షం
- ప్రధాన రహదారులు జలమయమై ట్రాఫిక్‌కు అంతరాయం
- డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ప్రజలకు ఇబ్బందులు
- జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తం
- కొనసాగుతున్న వర్షపు నీటి తొలగింపు పనులు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వానలు లేక విలవిల... కరువు కోరల్లో రెండు తెలుగు రాష్ట్రాలు

భారత వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా వర్షాలపై వాతావరణశాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. మరో మూడు, నాలుగు రోజులు చురుగ్గా నైరుతి రుతుపవనాలు కదలనున్నట్లు పేర్కొంది. ఉత్తర, తూర్పు, ఈశాన్య భారత్‌లో విస్తారంగా వానలు కురుస్తాయని చెప్పింది. పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, గుజరాత్, మహారాష్ట్రలో అతి భారీ వర్షాలు, జమ్ముకశ్మీర్, హిమాచల్, లడఖ్‌లో భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మాత్రం మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. దీంతో పంటల పెరుగుదల, దిగుబడి, చివరకు రైతుల ఆదాయం అనిశ్చితిలో పడే అవకాశం ఉంది.

**సరైన వానలు లేక...**

ఆంధ్రప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా వానలు పడుతున్నా సరిగా పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ఏపీలోని అనేక ప్రాంతాలు కరవు తో అలమటించిపోతున్నాయి. నైరుతి రుతు పవనాలు, అల్పపీడనం ప్రభావం, ఉపరి తల ద్రోణి కారణంగా అక్కడక్కడా వానలు పడతాయని, అయితే భారీ వానలు మాత్రం పడవని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రైతులు ఆరు తడి పంటలు మాత్రమే వేసుకోవాలని, వర్షాధార పంటల జోలికి వెళ్లవద్దని సూచించారు. రాయలసీమలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే ఉత్తరాంధ్రలోనూ వానలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేసిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**తేలిక పాటి జల్లులు...**

తెలంగాణలోనూ వానలు పడటం లేదు తేలికపాటి జల్లులు మాత్రమే పడుతున్నాయి. మోస్తరు వానలు కొన్నిచోట్ల పడుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడినప్పటికీ వానలు దంచి కొట్టక పోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. ఉత్తర తెలంగాణలో వానలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు ఎండిపోయాయి. ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సాగు, తాగు నీటికి ఇబ్బందిగా మారింది. ప్రధానంగా వ్యవసాయం కుదేలయి పోయింది. ఎక్కడ చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయి. ఎల్ నినో ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుంది. కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించి కేంద్ర సాయాన్ని కోరనుంది. మొత్తం మీద రెండు తెలుగు రాష్ట్రాలు కరువుతో విలవిలలాడుతున్నాయి.

# మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు.. భారీగా అభివృద్ధి చేస్తా

మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి**

ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేశ్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

**ఓటమి నేర్పిన పాఠం.. ప్రజల మనసు గెలిచా**

2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు.

**మోడల్ నియోజకవర్గమే లక్ష్యం**

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల ప్రయాణం**

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తోందని లోకేశ్ అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాల్లో నేటి నుంచి నిధులు జమ చేస్తున్నామని, 4 వేల రూపాయల పింఛను, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేయడం వల్లే కేంద్రం నుంచి నిధులు సులభంగా వస్తున్నాయని, నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎంఈ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడిపిన బైక్ ఢీకొనడంతో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు కుట్ర చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆరవ్ వర్మకు బదులుగా సిద్ధార్థ త్యాడి అనే వ్యక్తిని కేసులో ఇరికించి జైలుకు పంపే ప్రయత్నం చేశారని, బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని, అలాగే ప్రమాదానికి సంబంధించిన బైక్‌ను మార్చి ఆధారాలను తారుమారు చేయాలని చూశారన్న అభియోగాలతో అప్పలరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

వైసీపీ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూ భాగోతాలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన... స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడం దారుణమన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరించి సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పరువు తీసిన వారిని ధర్మాన వంటి నేతలు వెళ్లి పరామర్శించడం, జగన్ వారిని సమర్థించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజకీయ కక్షసాధింపులు తమ సంస్కృతి కాదని, తప్పు చేసిన ఎవరినైనా కూటమి ప్రభుత్వం చట్టప్రకారం శిక్షించి తీరుతుందని స్పష్టం చేశారు.

గతంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన జగన్, ఇప్పుడు వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి ఉత్తుత్తి సమావేశాలు నిర్వహిస్తున్నారని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలు తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడారని తెలిపారు. కేంద్ర మంత్రులు కూడా నేరుగా సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. ఢిల్లీ స్థాయిలో ఈ చర్చలు ఫలవంతం కావడంతో, ఆ క్రెడిట్ ఎక్కడ చంద్రబాబుకు దక్కుతుందోనన్న భయంతోనే జగన్ సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం రైతుల ప్రతి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

# ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల..

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'తల్లికి వందనం' పథకం నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ ఆర్థిక సాయాన్ని అందజేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఎటువంటి అవాంతరాలు ఎదురుకావని అన్నారు. పిల్లలే మన అసలైన సంపదని, వారి చదువులే కుటుంబానికి తరగని ఆస్తి అని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న ఆంక్షలను తొలగించి, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం ఫలాలను వేర్వేరుగా వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేస్తున్న దాదాపు 67.47 లక్షల మంది విద్యార్థులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతోందని వివరిస్తూ, పిల్లల చదువు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి తల్లికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో 152 ప్రశ్నపత్రాల లీక్‌లు జరిగాయని, దీంతో 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రాహుల్, ప్రశ్నపత్రాల లీక్‌లపై నిరసన తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా సమంజసమైనవేనన్నారు. వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడని విమర్శిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మూడు ప్రధాన డిమాండ్లను కేంద్రం ముందు ఉంచారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి, కుటుంబాలు రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా వారి భవిష్యత్తు దెబ్బతింటోందని రాహుల్ అన్నారు. ఈ పరిస్థితుల్లో సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు నష్టపోతుండగా, ప్రత్యేక అవకాశాలు ఉన్నవారికే ప్రయోజనం చేకూరుతోందని ఆరోపించారు.

# పార్లమెంటులో నీట్‌పై చర్చిద్దాం.. విపక్షాలకు కేంద్రం పిలుపు

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంటులో సమగ్రంగా చర్చించేందుకు తాము సిద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ అంశంపై సభలో పారదర్శకంగా చర్చించడం ద్వారా విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించవచ్చని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ కీలక ప్రకటన వెలువడింది. విద్యార్థుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని కిరణ్ రిజిజు ప్రకటించారు. పేపర్ లీకేజీ అంశంపై సభలో లోతైన చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని, ఈ సందర్భంగా ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వినిపించవచ్చని సూచించారు. అయితే, చర్చకు షరతులు విధించడం అంటే వారు చర్చను కోరుకోవడం లేదనే అర్థం వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏ సమస్య నుంచి పారిపోదని, అన్నిటినీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం

చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ లేదా అఖిలేష్ యాదవ్ వంటి నేతలు ఎవరైనా ఈ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని, అయితే సభా నిబంధనల ప్రకారమే చర్చ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. మరోవైపు, నీట్ పరీక్ష లీకేజీపై చర్చ జరిగే తేదీ, సమయాన్ని నిర్ణయించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను ప్రభుత్వం కోరింది.

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..

- మొదటి పేజి తరువాయి

అంతర్జాతీ య విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# తెలంగాణలో మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు..

తెలంగాణలో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మారిపోయిందని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం కూడా రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండి పలుచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, కృష్ణానగర్, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతతో పలు రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

# ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ షరతు.. దీక్ష విరమణకు సిద్ధం

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తన దీక్షను విరమించేందుకు ప్రభుత్వానికి ఒక షరతు విధించారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపు చర్యలు తీసుకోబోమని హామీ ఇస్తే, తాను దీక్షను విరమించడానికి సిద్ధంగా ఉన్నానని బుధవారం ప్రకటించారు. "ఈ ఉద్యమంలో పాల్గొన్న యువ నిరసనకారులపై ఎటువంటి శిక్షాత్మక లేదా ప్రతీకార చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రావాలని నేను గౌరవపూర్వకంగా కోరుతున్నాను. న్యాయబద్ధమైన, జవాబుదారీతనం కలిగిన విద్యా విధానం కోసం గళమెత్తడమే వారు చేసిన ఏకైక 'నేరం" అని కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్‌లకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. నీట్ అక్రమాలపై జవాబుదారీతనం, విద్యా సంస్కరణలు కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నారు. దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇప్పటికే ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ, ఆయన తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. సీజేపీ నేతృత్వంలో జరుగుతున్న ఈ ఆందోళనల క్రమంలో పోలీసులతో ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. విద్యార్థుల సంక్షేమం, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను ప్రధాన డిమాండ్లుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే ఉద్దేశంతోనే వాంగ్‌చుక్ ఈ ప్రతిపాదన చేశారు.

# అలా చేస్తే బ్రిడ్జి లేదా పవర్ ప్లాంట్‌పై దాడి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

చేస్తామని ఆయన హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించే నౌకలను లక్ష్యంగా చేసుకుంటే, ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై బాంబుల వర్షం కురిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ జలసంధిలో నౌకలపై ఎలాంటి దాడి జరిగినా అమెరికా తీవ్రంగా స్పందిస్తుందని, ఇరాన్‌కు చెందిన కీలక ఆస్తులను లక్ష్యంగా చేసుకుని నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.

హర్మూజ్ జలసంధి ప్రాంతంలో సముద్ర భద్రత, అంతర్జాతీయ చమురు సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ నౌకాయానానికి ఆటంకం కలిగించే ఇరాన్ చర్యల పట్ల అమెరికా కఠినంగా వ్యవహరిస్తుందనే సంకేతాలను ఈ హెచ్చరిక ఇస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలు ప్రాంతీయ స్థిరత్వం, దౌత్యపరమైన ప్రయత్నాలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# శ్రీ స్వామివారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



**పెన్ పవర్, ద్వారకాతిరుమల, జూలై 22:** ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి. గోపాల కృష్ణారావు సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు.

ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం కల్పించి వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

తదుపరి ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు స్వామివారి చిత్రపటాన్ని న్యాయమూర్తి దంపతులకు అందజేసి సత్కరించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి

## టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు ముచికర్ల శివ పిలుపు



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 22:** ఈ నెల 24న పోలవరం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటించనున్న నేపథ్యంలో ఈ పర్యటనను విజయవంతం చేయాలని రంపచోడవరం నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ముచికర్ల శివ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మెగా పేరెంట్--టీచర్స్ మీటింగ్ ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

తల్లులతో ముఖాముఖి కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలల్లోని సమస్యలు, విద్యా రంగ అభివృద్ధిపై ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్ నేరుగా చర్చించనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ముచికర్ల శివ కోరారు. పర్యటన విజయవంతానికి పార్టీ శ్రేణులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి





- లక్కవరం రహదారి సమస్య పరిష్కరించాలి
- ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం ఆందోళన


**చింతూరు, పెన్ పవర్ జులై 22 :** గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతూరులోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళనలో పాల్గొన్న గిరిజనులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే లక్కవరం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర పరిస్థితుల్లో కూడా రాకపోకలు కష్టంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిని తక్షణమే మరమ్మతు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కి వినతిపత్రం అందజేశారు. గిరిజనుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడంతో పాటు లక్కవరం రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజన రైతులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రంలో రచయిత్రి లయన్ శ్రీ పేరి జన్మదిన వేడుకలు.




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 22.** తాడేపల్లిగూడెం భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో రచయిత్రి లయన్ శ్రీ పేరి జన్మదిన వేడుకలు భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించి దివ్యాంగుల పిల్లలకు స్నాక్స్ బుక్స్, పలకలు అందజేసి లయన్ చెన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీ పేరి దివ్యాంగుల పిల్లల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం పిల్లలకు అవసరమైన విద్యా సామాగ్రి అందజేయడం చాలా సంతోషకరమైన విషయమని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని దేవుడు ఆరోగ్యం అష్టైశ్వర్యాలు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే భాగ్యాన్ని ఆ దేవుడు కల్పించాలని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ ఆంజనేయస్వామి, లియో ధనలక్ష్మి , భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్ కే బాల ఈశ్వరయ్య ఎం చంద్ర కుమారి, ఉష, దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోసం కొత్తగా రోడ్డు నిర్మాణం



**పెన్ పవర్, ఉంగుటూరు, జూలై 22:** ఉంగుటూరు మండలం నారాయణపురం ఎస్సీ పేట, వైఎస్సార్ కాలనీ సీ-బ్లాక్ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అనువుగా ఉండేలా కొత్త రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి.

మురుగుకాలువకు, కళాశాల ప్రహరీ గోడకు మధ్యలో నిరుపయోగంగా ఉన్న మట్టి రోడ్డును అభివృద్ధి చేసి కంకర రోడ్డుగా నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఎస్సీ పేట, వైఎస్సార్ కాలనీ సీ-బ్లాక్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం కలుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సుమారు రూ.1 లక్ష వ్యయంతో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మాజీ సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను తెలిపారు. గుత్తేదారుడు అక్కిన శేషు ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

# వర్షాల కోసం మహిళల ప్రత్యేక పూజలుశ్రీ వినాయక స్వామికి 108 బిందెల జలాభిషేకం



**పెన్ పవర్, ద్వారకాతిరుమల, జూలై 22:** ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, వానదేవుడు కరుణించాలని కోరుతూ గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామంలోని శ్రీ వినాయక స్వామివారి ఆలయంలో మహిళలు ఏకమై వినాయక స్వామికి 108 బిందెల నీటితో ఘనంగా జలాభిషేకం చేశారు. వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి పంటలు సమృద్ధిగా పండాలని, తాగునీటి సమస్య లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తిపూర్వకంగా ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా ప్రకృతి అనుగ్రహించి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతన్నల కష్టాలు తొలగి పాడిపంటలు బాగా పండాలని మహిళలు ఆకాంక్షించారు. ఈ ప్రత్యేక పూజల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# ఆర్టీసీ సమస్యలపై ప్రభుత్వానికి వివరిస్తాఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ జులై 22:** -రెండవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు గోకవరండిపో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యం లో జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని వినతిపత్రం అంద జేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ బస్సుల అమలు,స్త్రీశక్తి పథకం అమలులో తలెత్తుతున్న ఇబ్బందులు,ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పూర్తిగా వివరించామని మా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలియజేశారని జేఏసీ నాయకులు అన్నారు. ఆర్టీసీ సిబ్బందితోనే ఎలక్ట్రిక్ బస్సులు నడిపే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులతో మాట్లాడాలని, విజయవాడకు గోకవరం డిపో నుండి నడిచే బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని 1ల19సర్కులర్ కచ్చితంగా అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోకవరం డిపో జేఏసీ నాయకులు ఎంఎంఎస్ నారాయణ, జి ఎస్ రావు,బి సూర్యచంద్రరావు, వి వీరభద్రరావు, పడాల బంగారయ్య,ఎం శ్రీను, కోండ్రోతు సుబ్బారావు, బోరుసు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి






- అన్ని శాఖలు సమన్వయంతో ప్రోటోకాల్ పాటిస్తూ ఏర్పాట్లు పూర్తి చేయాలి
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 22 :** ఈ నెల 24న పోలవరం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శాఖలవారీగా సమీక్షించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాపర్ ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారుల మరమ్మతులు, శుభ్రత, సూచిక బోర్డులు, డివైడర్లు, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ప్రోటోకాల్‌ను కచ్చితంగా అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని, అటవీ శాఖ ఆధ్వర్యంలో స్నేక్ క్యాచర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సరస్వతి దేవి, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం తల్లులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో కలిసి మెగా పేరెంట్--టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని, సెల్ఫీ స్టాండ్‌ను సందర్శించి, 9వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజనం చేయనున్నారు.

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్యం, రహదారులు, పంచాయతీరాజ్, అటవీ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జులై 22;** భారతదేశ అమెరికాతో చేసుకున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా జీలుగుమిల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం అఖిల భారత రైతు కూలి సంఘం, అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది . ఈ ధర్నా సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జీలుగుమిల్లి మండల కార్యదర్శి కట్టం నాగేశ్వరరావు, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డం ముత్యాలరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అమెరికా దేశానికి తలవొగ్గి వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడం జరిగిందని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకోవడం ఒకటే మిగిలి ఉందని ఈ చర్యలను మన దేశంలో ఉన్న అన్ని రైతు కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఏమాత్రం ప్రజల యొక్క అభీష్టాన్ని గౌరవించకుండా నియంతల వ్యవహరించడం జరుగుతుందని అన్నారు. అమెరికాలో పండినటువంటి పంటలను భారతదేశ మార్కెట్లో అమ్ముకోవాలి అంటే ఎటువంటి సుంకాలు లేకుండా అమ్ముకునే విధంగా భారత్ అమెరికాకు ఎగుమతి చేసే పంటలను అమెరికా మార్కెట్లో అమ్ముకోవాలంటే అమెరికా ప్రభుత్వానికి 18 శాతం టాక్స్ కట్టి అమ్ముకోవాల్సిన దుస్థితి భారతదేశానికి ఏర్పడిందని అన్నారు. ఏదైతే భారతదేశం అమెరికాతో చేసుకోవాలని చూస్తున్న ఒప్పందాన్ని రద్దు చేసుకొని భారతదేశ రైతన్న ఆదుకోవాలని రైతులకు మద్దతు ధర ప్రకటించాలని ఎరువులు వ్యవసాయ యాంత్రీకరణలో సబ్సిడీని ఎక్కువగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండల తహసిల్దార్, +. వెంకటేశ్వరావు కి డిమాండ్లతో కూడిన వినతి




పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ.ధర్నాలో మండల ఏ ఐ కె ఎమ్ ఎస్ నాయకులు ఊకే వెంకటేశ్వరరావు, డోల నరసింహారావు, కరక నాగులు, పేరం నాగు, తగరం సత్యనారాయణ, దగ్గు మిల్లి సత్యనారాయణ, అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు కట్ట ముత్యాలరావు, కట్టం రత్తమ్మ, సోడం విజయ్, ఓకే రవి ,నారాయణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పెరిగిపోతున్న వివిధ రకాల దొంగతనాలు



**వై రామవరం,పెన్ పవర్,జూలై 22 :** మండలంలో ప్రతి గ్రామంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయని, దొంగతనానికి అది ఇది అని తేడా లేదని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో చవిటి దిబ్బలలో దొంగతనాలు మరీ మితిమీరు పోయాయని పలువురు వాపోతున్నారు. చవిటి దిబ్బలు గ్యాస్ డీలర్ కే సన్యాసమ్మ ఇంటి వద్ద ఉన్న ఫుల్ సిలిండర్ దొంగలించారని అన్నారు. గతంలో రెండు సిలిండర్లు దొంగలించబడ్డాయని పోలీస్ లకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రామంలో సెంటర్లో ఉన్న టీ స్టాల్ వద్ద టచ్ ఫోన్ అపహరణకు గురైందని నిర్వాహకురాలు తెలిపారు. గతంలో ఒక ఉపాధ్యాయుని మోటార్ సైకిల్ దొంగిలించ బడిందని స్థానికులు తెలిపారు. అదేవిధంగా మేకలు దొంగలించబడ్డాయని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని తెలిపారు. ఇన్ని వరుస దొంగతనాలు జరుగుతున్న నేటి వరకు ఒక్క దొంగ కూడా పట్టుబడలేదని తెలిపారు. ఇకనైనా పోలీసు అధికారులు స్పందించి దొంగతనాలు నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.


## రూ.140 కోట్లతో నగర డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన



- 9వ డివిజన్‌లో రూ. 22.75 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:** రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరవ్యాప్తంగా రూ.140 కోట్లతో కొత్త డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి, శిథిల డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. నగరంలోని 9వ డివిజన్ మహాలక్ష్మి ఆలయం సమీపంలోని విద్యుత్ కాలనీ 7వ వీధిలో రూ.22.75 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్పొరేషన్ జనరల్ నిధులు రూ.22.75 లక్షలతో పనులను ప్రారంభించామని చెప్పారు. ఈ పనుల్లో భాగంగా సీసీ రోడ్డుతో పాటు, డ్రైనేజీ పనులు కూడా చేపడు తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం 9వ డివిజన్‌లోనే రెండు సంవత్సరాల వ్యవధిలో రూ.14 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేసామన్నారు. ఇప్పటికే రూ.14 కోట్ల పనులు పూర్తిచేసినా, ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంటే ప్రజారోగ్యంతో పాటు నిర్మించిన రోడ్ల మన్నిక కూడా పెరుగుతుంద న్నారు. డెల్టా ఆసుపత్రి వెనుక రహదారుల సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో రెండు ప్రధాన రోడ్లకు సుమారు రూ.2 కోట్ల తో డ్రైనేజీ, రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను ఎన్‌క్యాప్ నిధులు రూ.80 లక్షలతో ఈ నెల 25వ తేదీన ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. డివిజన్ ఇన్‌ఛార్జ్ కోసూరి చండీప్రియ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొల్లి బుజ్జి, మరుకుర్తి శివ యాదవ్, ముసిని బాబూరావు, విశ్వనాథ రాజు, స్థానిక పెద్దలు, కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేయాలి






**ఆర్డీవో ఆర్. శివ రాముడు**

**రాజమహేంద్రవరం పెన్ పవర్ జూలై 22** :ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమా న్ని నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని రాజమహేం ద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. శివ రాముడు బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు. రాజానగరం మండలం లాలచెరువు గ్రామంలోని స్వర్ణ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన తహసీల్దార్, సూపర్వైజర్లతో కలిసి బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఇంటింటి సర్వేలో ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో మరణించిన వారు, చిరునామా మార్చుకున్న వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో ధృవీకరించి, పొరపాట్లకు తావు లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో తహసీల్దార్, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం





**రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:** రాష్ట్రంలో యువతకు విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంబించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహించి, యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింద న్నారు. రాజమండ్రి గ్రామీణ నియోజక వర్గ పరిధిలో సుమారు 1,600 ఉద్యోగాల భర్తీ కోసం బుధవారం జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాబోయే మూడు నెలల్లో బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం కేంద్రాలుగా భారీ స్థాయిలో మెగా జాబ్‌మేళాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. యువత కు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయ్ మెంట్ శాఖలను సమన్వ యం చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణ కల్పించిన మానవ వనరులను సంసిద్ధంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సుమారు రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు ఏర్పాటవు తున్నాయన్నారు. కడప, నక్కపల్లి ప్రాంతాల్లో ఐటీ, డేటా సెంటర్లు, మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన అనేక సంస్థలు ముందుకు వస్తుండటంతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయ న్నారు. యువతను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దేం దుకు టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి సంస్థల సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ లను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్‌మేళాను విజయ వంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా ఉపాధి కల్పన అధికారి, స్కిల్ డెవలప్ మెంట్ అధికారి సిహెచ్. శిరీష, మాట్లాడుతూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సహకారంతో రూరల్ నియోజకవర్గ యువత కొరకు నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింద న్నారు .స్కిల్ డెవలప్ మెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ , ఏపీఎస్ ఎస్‌డీసీ తదితర శాఖలు, సంస్థల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో వెయ్యి మందికి పై యువత తమ పేర్లను నమోదు చేసుకు న్నట్లు వెల్లడించారు. జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని, అర్హత, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారని తెలిపారు.

రాబోయే మూడు నెలల్లో స్థానిక సంస్థలు, దేశ ప్రముఖ కంపెనీలతో భారీ స్థాయిలో మెగా జాబ్‌మేళాను నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, వివిధ విద్యార్హతలు కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలను, కమ్యూనికేషన్ స్కిల్స్, భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అంశాలపై యువతకు శిక్షణ అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, మత్శేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, గంగిన హనుమంతరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నన్ను కృష్ణ, బొప్పన శ్రీను, తాడేపల్లి నాగరాజు, వట్టికూటి దత్తుడు, నిచ్చినకోళ్ల సత్తిబాబు, వల్లూరి శ్రీరామ చౌదరి, కొప్పుశెట్టి నాగేశ్వరరావు, ఐటీడీపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావన తో గోదావరి పుష్కర పనులు చేయాలి

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో జె సి వై. మేఘా స్వరూప్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22**

గోదావరి పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన ఆధ్యాత్మిక వేడుకగా భావించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

గోదావరిపుష్కరాలు --2027 ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ పాల్గొన్నారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు జిల్లాలో చేపట్టిన సన్నాహాలు, శాఖలవారీగా ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి, కార్యాచరణ ప్రణాళికలను ముఖ్యమంత్రికి జాయింట్ కలెక్టర్ వై మేఘా వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ

భక్తులకు అసౌకర్యం కలగకుండా రహదారులు, ఘాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, వైద్య సేవలు, భద్రత తదితర మౌలిక సదుపాయాలను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

ప్రతిపాదిత పనులకు పరిపాలనా, సాంకేతిక అనుమతులను వేగవంతం చేయాలని, ప్రతి శాఖ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ట్రాఫిక్ , విపత్తు నిర్వహణ, అగ్నిమాపక, కమ్యూని కేషన్ వ్యవస్థలు, సమాచార సాంకేతిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేసి పుష్కరాల నిర్వహణలో లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళికను కాలపట్టిక ప్రకారం అమలు చేయాలని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులో నాణ్యతతో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# వచ్చే నెల 18 న రెడ్ క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా వార్షిక సర్వసభ్య సమావేశం ఆగస్టు 18 వ తేదీ న స్థానిక కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షురాలు, కలెక్టర్ కీర్తీ చేకూరి తెలిపారు. బుధవారం స్థానిక వై జంక్షన్ కలెక్టర్ క్యాంపు ఆఫీస్ నందు రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు, కలెక్టర్ కీర్తీ చేకూరిని జిల్లా మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గోగినేని తరుణ్,జిల్లా కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి, సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, జె సురేష్, బోను రామకృష్ణ లు కలిసి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు, యోగా శిక్షణ కోర్సుల గురించి సమీక్షించారు. త్వరలోనే బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే పుష్కరాలలో సేవలందిం చేందుకు లైఫ్ మెంబర్స్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాతేరు మత్స్యకారులకు త్రాగునీరు అందించాలి

బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర వినతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:**ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి ఫ్లోర్ లీడర్ , ఎం ఎల్ సి సోము వీర్రాజు సూచన మేరకు జనతా వారధి బృందం నగర శివారు కాతేరు మత్స్యకారుల కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ, 70 సంవత్సరాల నుంచి మత్స్యకారులు కాతేరు గ్రామంలో గోదావరి గట్టు వద్ద నివాసం ఉంటూ చేపల వేట ఆధారంగా జీవిస్తున్నారన్నారు. చిన్న చిన్న షెడ్డులు వేసుకుని పిల్లలతో ఉంటున్నారని, త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటు న్నారన్నారు. చేతి పంపులలో వచ్చే నీటిలో సున్నం ఉంటుందని, ఆ నీరు కూడా ఉపయోగ పడడంలేదన్నారు. త్రాగు నీరు సమస్య పరిష్కారం కోసం ఎంపీ పురంధేశ్వరి, ఎం ఎల్ సి సోము వీర్రాజు, ఎం ఎల్ ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సహకారం తీసుకుంటామని పిక్కి నాగేంద్ర అన్నారు.

ఈ కార్యక్రమంలో జనతా భారతి బృందం యానాపు ఏసు, స్వామి సూర్యకిరణ్, ఆకుల నరేష్, తుమ్మలపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## 29, 30 డివిజన్లలో 'మన వార్డులో -- మన ఆదిరెడ్డి'



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:**గత వైసీపీ పాలనలో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. 29, 30 డివిజన్లలో "మన వార్డులో -- మన ఆదిరెడ్డి" కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వాసు స్థానిక సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టీడీపీ యువ నాయకుడు రఘు నివాసంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం చేస్తోందన్నారు. 29వ డివిజన్‌లో మూడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో లో-వోల్టేజ్ సమస్య తగ్గిందన్నారు. నగరానికి 5 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నా యన్నారు. మహిళల భద్రత లో భాగంగా గత రెండేళ్లలో 130 మందిపై రౌడీ షీట్లు నమోదుచేసి, పీడీ యాక్ట్ అమలు చేశామని తెలిపారు. నగరంలో 30 వేల మందికి పెన్షన్లు అందుతున్నాయని, మరో మూడు నుంచి నాలుగు వేల మంది అర్హులకు త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. గత రెండేళ్లలో 8 వేల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. 30వ డివిజన్‌లో రూ.70 లక్షల పనులు పూర్తయ్యాయని, పుష్కరాల నాటికి రూ.2.60 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 29వ డివిజన్‌లో రూ.60 లక్షల పనులు పూర్తికాగా, రూ.10 లక్షల పనులు కొనసాగు తున్నాయని, మరో రూ.2.13 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. దేవాదాయ శాఖ ద్వారా దేవాలయాల అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు తీసుకువచ్చా మన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్, తాడేపల్లిగూడెంలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమనీ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 22:**తాడేపల్లిగూడెంలోని నారాయణ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోలిశెట్టి రాజేష్, ఎం.ఈ.ఓ. శ్రీమతి పి. ఎం. కె. జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి నాయకులకు బ్యాడ్జ్‌లను అందజేసి అభినందించారు. అనంతరం నూతన విద్యార్థి నాయకులను సత్కరించి, వారి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన శ్రీ బోలిశెట్టి రాజేష్ నాయకత్వ లక్షణాలు, క్రమ శిక్షణ, బాధ్యతాయుతమైన వ్యవహారం, సేవాభావం వంటి విలువలను అలవరచుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి నాయకులని, విద్యతో పాటు నాయకత్వ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఎం.ఈ.ఓ. శ్రీమతి పి. ఎం. కె. జ్యోతి విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పాఠశాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డిజిఎం . పి. రామిరెడ్డి ,ఆర్ ఐ. బి. సురేష్ గల్,ప్రిన్సిపాల్, ఏ. అంఫీ,ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ధవలేశ్వరంలో వసతి గృహం విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:**విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ధవలేశ్వరం గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, కడియం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసినమెటీరియల్ ఎమ్మెల్యే గోరంట్ల పంపిణీ చేసారు. ఇందులో ట్రంక్ పెట్టె, స్టీల్ ప్లేటు, గ్లాసు, కప్, జంబుఖాన, దుప్పటి, రగ్గు, స్వెటర్, టర్కీ టవల్, నైట్ డ్రెస్సెస్ (2జతలు)తో కూడిన మెటీరియల్ కిట్ ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, ధవలేశ్వరం వసతి గృహం నందు 68 మంది విద్యార్థులకు, కడియం బాలికల వసతి గృహం నందు 40 మంది విద్యార్థినీలకు క్వాలిటీ కిట్లు అందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి లోకేష్ విద్యార్థులకు అందించే ప్రతి వస్తువును స్వయంగా పరిశీలిస్తు న్నారని, పుస్తకాలు, యూనిఫాం, బూట్లు నాణ్యతతో అందిస్తున్నారని తెలిపారు. మంచి మెనూతో నాణ్యమైన భోజనాన్ని కూడా అందిస్తున్నారని తెలిపారు. అనంతరం వసతిగృహం విద్యార్థులతో సౌకర్యాల గురించి అడిగి తెలుసు కున్నారు. వసతి గృహం లో విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. వసతి గృహం లో మరిన్ని సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ పి.ఎన్.వి సత్యనారా యణ, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి మజ్జి పద్మావతి, ధవలేశ్వరం హెచ్.డబ్ల్యూ.ఓ బండారు లక్ష్మణ్, కడియం హెచ్.డబ్ల్యూ.ఓ అడపా అన్నపూర్ణ, పుక్కళ్ళ రాజు, ఎడ్ల మహేష్, బత్తిని ఏడుకొండలు, కేవీ నాగేశ్వరరావు, దూది సాయిబాబు, షేక్ సాజిత్, ఎల్లాపు పాండురంగారావు, నాళ్ళ రమేష్, వంక వెంకటరమణ, దాసరి సాగర్, పిల్లి వెంకటరమణ, విజ్ఞాన శివ, గండిబోయిన నాగరాజు, బొబ్బిలి రామకృష్ణ, బొక్క శ్రీను, నీలి కోటేశ్వరరావు, గొల్ల క్రాంతి, కరణం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వాసవి అమ్మవారి ఆలయంలో వరాహి అమ్మవారి గుప్త నవరాత్రుల్లో భాగంగా వరాహి అమ్మవారి హోమం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 22.**వాసవి అమ్మవారి ఆలయంలో వరాహి అమ్మవారి గుప్త నవరాత్రుల్లో భాగంగా వరాహి అమ్మవారి హోమం మంగళవారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 2 గంటల వరకు ఏలూరు రోడ్ లోని వాసవి మాత ఆలయంలో శ్రీ మహి వరాహ ( వరాహి) హోమము (ద్రవ్యములు దేశీయ ఆవు పిడకలు ఆవు నెయ్యితో)

బ్రహ్మశ్రీ కుందుర్తి మహీ కిరణ్ శర్మ( విజయవాడ కనకదుర్గ అమ్మవారి ప్రధాన అర్చకుల వంశీకులు) బ్రహ్మత్వంలో ఈ హోమము జరిపించబడింది . ఈ హోమం 6 గంటల పాటు నిరాటంకంగా కొనసాగింది భక్తిరస పాటలతో ప్రవచనాలతో గో మహత్యం గురించి గోవుని ఏ విధంగా పూజించాలో తెలియజేసి వరాహి అమ్మ వారి విశిష్టతను తెలియజేసి ఆవు పిడకలు ఆవు నెయ్యితో సుగంధ ద్రవ్యాలతో పెద్ద ఎత్తున ఈ హోమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లపర శ్రీరామచంద్రమూర్తి, సెక్రటరీ నున్న బాలా త్రిపుర సుందర్రావు దంపతులు ట్రెజరర్, బోగవిల్లి రమేష్ దంపతులు ఆలయ సెక్రటరీలు ఆలపాటి సత్యనారాయణ దంపతులు ట్రెజరర్ ఆలపాటి కృష్ణ కుమార్ దంపతులు ఇంటర్నేషనల్ వైశ్యపరేషన్ ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురాలు మంద పద్మావతి దంపతులు వీరితోపాటు సుమారు 20 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రాము మాట్లాడుతూ ఈ వరాహి అమ్మవారి హోమం చేసుకోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కిరణ్ శర్మ ఇక్కడికి వచ్చి ఈ యజ్ఞం చేయడం మాకు చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. సెక్రటరీ సుందరం మాట్లాడుతు వరాహి అమ్మవారు మహా మహిమగలవాలని లలితాదేవికి సైన్యాధిపతిగా అనేకమంది రాక్షసులను శిక్షించడం జరిగినది. శ్రీమహా విష్ణు వు యొక్క మరో అవతారం వరాహనరసింహస్వామి స్త్రీ రూపమే ఈ వరాహి అమ్మవారు తలకాయ వరాహి రూపంలో ఉండి మిగతా శరీరమంతా మానవ రూపంలో ఉంటుందని తెలియజేశారు. హోమంలో కూర్చున్న దంపతులు కాకుండా సుమారు 200 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హోమం అనంతరం అందరికీ అల్పాహారం ఏర్పాటు చేశారు.

## బురద మయంగా గర్ల్స్ హాస్టల్ రోడ్డు...




**-విద్యార్థులకు,స్థానికులకు నరకం**

**కూనవరం,పెన్ పవర్,జూలై 22.** మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుండి గర్ల్స్ హాస్టల్ కు వెళ్లే ప్రధాన రహదారి వర్షం పడగానే బురద కూపంగా మారుతోంది. రోడ్డంతా గుంతలు,వర్షపు నీరు నిల్వ ఉండటంతో పాదచారులు కాలు పెట్టడానికే భయపడుతున్నారు.ప్రతిరోజూ హాస్టల్ కు వెళ్లే విద్యార్థినులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.వర్షాకాలంలో ఆటోలు,ద్విచక్ర వాహనాలు, పాదచారులు ఈ దారి వైపుగా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డుపై మెటల్,మోరం పోసి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా దివంగత ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు

# రౌతు పండు విగ్రహావిష్కరణ





**నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు**

**గోకవరం పెన్ పవర్ జులై 22:**--దివంగత గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రౌతు పండు జయంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం గోకవరం ప్రెస్ క్లబ్ లో అత్యంత ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పాత్రికేయులు, అభిమానులు, ప్రజలు, ప్రెస్ క్లబ్ సభ్యులు భారీ సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.ముందుగా రౌతు పండు కుటుంబ సభ్యులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, అధికారులు, పాత్రికేయులు, అభిమానులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు ఊ.. మాట్లాడుతూ, రౌతు పండుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాత్రికేయుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. గోకవరం ప్రాంతంలోనివిలేకరులందరి నీ ఒకే వేదికపైకి తీసుకురావడంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి పునాది వేయడంలో, విలేకరులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో ఆయన చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు.ఆయన లేని లోటు పాత్రికేయ సమాజానికి ఎప్పటికీ తీరనిదని భావోద్వేగంతో నివాళులర్పించారు.దివంగత రౌతు పండు జయంతిని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరం నుంచి విచ్చేసిన ప్రముఖ వైద్యులు నిరుపేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ,రౌతు పండు పాత్రికేయ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని నిష్పాక్షిక పాత్రికేయానికి ఆయన నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు.సమాజానికి ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రెస్ క్లబ్ సభ్యుల బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా దివంగత రౌతు పండు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఇంతకాలం మా కుటుంబం మాత్రమే ఆయనపై అభిమానాన్ని చూపుతుందని భావించాం కానీ ఇప్పుడు అనేక కుటుంబాలలో ఉన్న సభ్యులందరూ కూడా ఆయనను స్మరించుకుంటూ ప్రేమాభిమానాలు చూపడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు ప్రతి సంవత్సరం ఇదే విధంగా ఆయన జయంతి వేడుకలను నిర్వహించి, ఆయన సేవలను చిరస్మరణీయంగా నిలిపేలా కృషి చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.

# 12 ఏళ్ల లో 152 లీకేజీలు మోడీ పాలన దారుణ వైఫల్యం

**రాహుల్ గాంధీపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 22:** దేశ ప్రధానిగా 12 సంవత్సరాల పాలనలో 152 సార్లు నీట్ , జి వంటి ఉన్నత స్థాయి పరీక్షల పేపర్ల లీకేజీ జరగడం మోడీ పాలన దారుణ వైఫల్యం అని కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ టీకే విశ్వేశ్వర రెడ్డి ధ్వజమెత్తారు. ఈ లీకేజీల వల్ల కోట్లాదిమంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక వేదనకు, సమస్యలకు గురయ్యారని విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లపై మోడీ ప్రభుత్వం పాల్పడిన దమనకాండను ఖండించారు. ఈ సందర్భంగా టికె మాట్లాడుతూ, దేశ చరిత్రలో ప్రతిపక్ష నాయకుని పై దాడి చేయడం దురదృష్టకరమని ఈ దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ప్రజలు భావిస్తున్నారు. ఈ దాడి పై దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతుందన్నారు. దేశ ఉన్నత సిబిఐ, ఈ డి, ఈసీఐ, సుప్రీంకోర్టు, వంటి రాజ్యాంగ సంస్థలను మోడీ, అమిత్ షాలు వారి గుప్పెట్లో పెట్టుకొని దేశాన్ని నియంత్రిస్తున్నారని విమర్శించారు. నియంత్రత పోకడ ఆపకపోతే రానున్న రోజుల్లో గతంలో పక్క దేశాల్లో జరిగిన యువత తిరుగుబాటు మోడీని ఇంటికి పంపించేలాగా ఉప్పెన వస్తుందని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక విలువలతో అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ లు రాజీనామా చేయాలని టి కె డిమాండ్ చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ , ప్రజలు, యువత , నిరుద్యోగులు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసానికి శాంతియుత ర్యాలీగా బయలుదేరిన లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలు వలపై జరిగిన దాడేనని విమర్శించారు. నిరుద్యోగ సమస్య, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామకాలలో జరుగుతున్న అవకత వకలపై ప్రధానమంత్రి పార్లమెంట్‌లో చర్చించాలని కోరితే స్పీకర్ తిరస్కరించడం దారుణమ న్నారు

**పిసిసి ప్రధాన కార్యదర్శులు ఆకుల భాగ్యలక్ష్మి, తాళ్లూరి విజయకుమార్ మాట్లాడారు.**

. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుడిపై భౌతిక దాడికి పాల్పడటం దారుణమన్నారు. యువత కు మద్దతుగా వెళ్ళిన రాహుల్ గాంధీని, ఎంపీ ప్రియాంకా గాంధీని మోడీ ప్రభుత్వం కర్కశం గా అరెస్టు చేయడం నియంత్రత్వ దోరణి కి నిదర్శనమన్నారు. నీట్ పేపర్ లీకేజీ కి నైతిక బాధ్యత తో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా కోరాలన్నారు. అలా కాకుండా వెనుకేసుకుని రావడం దారుణమన్నారు. విద్యార్థులు నిర్వహించే ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ మద్ధతుగా నిలబడు తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, బీజేపీ ప్రజల రక్షణ కంటే భక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ధ్వజమెత్తారు. నీట్ పేపర్ లీకేజీ, నిరుద్యోగుల సమస్యలపై యువత నిరసన తెలియచేస్తూంటే వారిపైకి మోడీ ,అమిత్ షాలు తూటాలు ఎక్కుపెట్టడం గర్హనీయమన్నారు. దేశ భవిష్యత్తు ఆస్తి అయిన యువత రోడ్డెక్కి పోరాటాలు చేయాల్సిన పరిస్థితిని బిజెపి కల్పించడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ పోరాటం ప్రధాని మోదీ గద్దె దిగేవరకు కొనసాగుతుందని స్పష్టం చేసారు. అనంతరం గణేష్ చౌక్ మీదుగా జాంపేట మహాత్మా గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, తాడి సూరిబాబు, బర్రే సుబ్రహ్మణ్యం, కిశోర్‌కుమార్ జైన్, సాకా పుల్లారావు, సింధియా రాణి, యర్రా రామకృష్ణ, జయలలిత, తాడేపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జనవాణి' : ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం,పెన్ పవర్ జులై 22:** రాష్ట్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి మంగళగిరిలో జనసేన ప్రధాన కార్యాలయంలో ప్రతిరోజు 'జనవాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నామని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో బుధవారం 'జనవాణి' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర ప్రక్రియగా జనసేన ప్రధాన కార్యాలయంలో 'జనవాణి' కార్యక్రమాన్ని జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రూపొందించారని అన్నారు. రాజకీయమంటే కేవలం అధికారం కోసం మాత్రమే కాకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారానికి కృషి చేయాలనే పవన్ ఆశయాలను నెరవేర్చే దిశగా పనిచేస్తున్నామన్నారు. ప్రతి సోమవారం గ్రామాలలో పట్టణాలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్. ఎస్.)లలో పరిష్కారం కాని సమస్యలను జనవాణిలో పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. రోడ్లు,డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరా,పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర ముఖ్యమైన బాధ్యతలను నెరవేర్చకుండా వైసిపి అరాచక పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. రైతులు, ఎస్సీ ఎస్టీ, బీసీ తదితర వెనుకబడిన వర్గాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు ఎన్నో అవస్థల పాలయ్యారన్నారు. గత ప్రభుత్వ అసమర్థ నిర్వాకాలవల్ల రాష్ట్రంలో ప్రజా సమస్యలు కొండల్లా పేరుకుపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్. )ల ద్వారా పెద్ద ఎత్తున ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. దీర్ఘ కాలంగా సమస్యలు పరిష్కారం కాకుండా సతమతమయ్యే ప్రజలకు సత్వరమే ఉపశమనం కలిగించి, సమగ్ర పరిష్కారం చూపించాలనే బృహత్తర లక్ష్యంతో జనసేన కార్యాలయంలో నిరంతర ప్రక్రియగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అధినేత పవన్ కళ్యాణ్ తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ముఖ్య నేతలందరూ దశల వారీగా ఈ జనవాణిలో పాల్గొని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్ర విజిలెన్స్ కమిటీ మెంబరుగా అరిగెల బలరామమూర్తి నియామకం



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 22:** జిల్లా కోకోపేడ్ చైర్మన్, సీనియర్ కన్స్యూమర్ యాక్టివిస్ట్ అరిగెల బలరా మూర్తి ని రాష్ట్ర విజిలెన్స్ కమిటీలో మెంబర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా ఉత్తర్వులను అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా అరిగెల బలరామమూర్తి అందచేసారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ మరింత బాధ్యత వహించి కన్స్యూమర్స్ కు న్యాయం చేయాలని అమ్నారు. గత 40 సంవత్సరాలుగా కన్స్యూమర్ యాక్టివిటీ గా ఉంటూ అనేక సమస్యలను తీర్చి కన్స్యూమర్స్ కు న్యాయం చేయటం మీ దక్షతకు నిదర్శనమని ఈ సందర్భంగా ప్రభుత్వం గుర్తించి మీకు రాష్ట్ర కమిటీలో నియమించటం జరిగిందని గౌరవ శాసనసభ్యులు ఆనందరావు అన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆనందరావు కు అరిగెల బలరా మూర్తి గారు కృతజ్ఞతలు తెలియజేశారు. కన్స్యూమర్స్ సమస్యల పరిష్కార ఫారం ఏర్పాటు చేయటానికి కూడా కృషి చేయగలరని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా కోకోఫెడ్ ఉ డిసిపిసి మెంబర్స్ బీవీ సత్యనారాయణ, జీవీఎల్‌ఎన్ శర్మ, బి వి హనుమంతరావు, అద్దంకి అమరేశ్వరరావు, ఆకుల దొరబాబు, నేలపూడి నాగభూషణం, కొత్తపేట ఉషా మేడం సిస్టర్స్, తదితరులు అరిగెల బలరా మూర్తి ని ఘనంగా సత్కరించారు.

# రూ.16.5 కోట్ల అభివృద్ధి పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి: జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్





**కరప/కాకినాడ రూరల్,పెన్ పవర్ జూలై 22:** కాకినాడ జిల్లాలో రూ. 16.5 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం కౌడా వైస్ చైర్మన్ హోదాలో కరప మండలంలోని వలసపాకల, నడకుదురు గ్రామాల్లో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కావుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అపూర్వ భరత్ మాట్లాడుతూ, కావుడా నిధులతో మంజూరైన డ్రెయిన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి, పత్తి పంటలకు పంటల బీమా తప్పనిసరి

**మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్**



**గంగవరం ,పెన్ పవర్, జూలై 22:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది పంటలపై, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున మండలంలోని ప్రతి సాగు రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ సూచించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎకరానికి ఒక పంట కాలానికి వరి పంటకు రూ. 646, పత్తికి రూ. 1,923, మొక్కజొన్నకు రూ. 501 ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చని తెలిపారు. పంట రుణాలు పొందిన రైతుల తరఫున బ్యాంకులే ప్రీమియం మొత్తాన్ని సంబంధిత బీమా సంస్థకు చెల్లిస్తాయని, రుణాలు పొందని రైతులు స్వయంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.మొక్కజొన్న, పత్తి పంటలకు జూలై 31లోగా, వరి పంటకు ఆగస్టు 15లోగా బ్యాంకు లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ప్రీమియం చెల్లించి, రశీదును సమీప రైతు సేవా కేంద్రంలో అందజేయాలని సూచించారు. పంటల బీమాకు సంబంధించిన పూర్తి వివరాల కోసం రైతులు సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ కోరారు.

# జనసేన పార్టీ కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం





- **జనసేనపార్టీమండలఅధ్యక్షులుఎం.సాయికృష్ణ,**
- **జనసేన,మహిళానాయకురాలుబి.ప్రమీలరాణి,**

**వి. ఆర్. పురం పెన్. పవర్. జూలై. 22:** మండలంలోనిరేఖపల్లి,గ్రామంలోబుధవారంజనసేన పార్టీ,మండలఅధ్యక్షులుములకాల సాయికృష్ణ, జనసేనపార్టీ,మండల జనసైనికులు,జనసేనపార్టీ, మహిళానాయకురాలు,బాగులప్రమీలరాణి,ఆధ్వర్యంలో,జనసేనపార్టీ కార్యాలయం నిర్మాణ ప్రారంభోత్సవం,ఘనంగాజరిగింది. ఈసందర్భంగా జనసేనపార్టీ మండలఅధ్యక్షులు ములకాలసాయికృష్ణ,మాట్లాడుతూ, జనసేనపార్టీ,కార్యాలయం ప్రజలకు,కార్యకర్తలకు మరింత చేరువగా ఉండి,పార్టీ సిద్ధాంతాలను,ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకలాపాలు నిర్వహించడం,సమావేశాలు,ఎన్నికల ప్రణాళికలు,వ్యూహాలు రూపొందించడం,వంటి కార్యక్రమా లకు, ఈకార్యాలయం ఉపయోగపడుతుందని,తెలిపారు. మండలంలోని,ప్రజలుతమ సమస్యలను నేరుగా నాయ కుల దృష్టికి తీసుకురావడంతో,పరిష్కారంచేసే,విధంగా ఈకార్యాలయం నిలుస్తుందని, పేర్కొన్నారు. సెప్టెంబర్ 2న జనసేనపార్టీ,అధ్యక్షుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణి దల పవన్ కళ్యాణ్,జన్మదినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథుల సమక్షంలో నూతనపార్టీ కార్యాలయాన్ని,అంగ రంగ వైభవంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మండలంలో జనసేనపార్టీ,కార్యాలయం నిర్మాణం జన సేనకు కొత్తఉత్సాహాన్ని,వైభవాన్ని తీసుకువస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలోమండల కార్యదర్శిబాగుల అంజనరావు,కెచ్చులపోసిరెడ్డి,యువజ న విభాగం అధ్యక్షులు పెదపెట్ల పవన్ కళ్యాణ్,గూటాల సమ్మరాజు,మండల సహాయకార్యదర్శులు మాచర్ల వేణు బాబు,ముంజపు శ్రీరామ్,సీనియర్ నాయకులు మాదిరెడ్డి బోసు,తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద పార్కులో పశువులు, వీధికుక్కలు



**భద్రతా లోపాలపై పౌర సంక్షేమ సంఘం ఆందోళన**

**కాకినాడ, పెన్ పవర్,జూలై 22:** నగరంలోని వివేకానంద పార్కు నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ రమణరాజు ఆరోపించారు. పార్కులో ఆవులు, గేదెలు, వీధికుక్కలు, పందులు, యాచకులు స్వేచ్ఛగా సంచరిస్తుండటంతో సందర్శకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. జవహర్ వీధి ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో లేకపోవడంతో పశువులు, ఇతరులు యథేచ్ఛగా పార్కులోకి ప్రవేశిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాన ద్వారం వద్ద భద్రత లేకపోవడంతో గేటు ముందు వాహనాలు నిలిపివేస్తుండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య గత ఎనిమిది నెలలుగా కొనసాగుతోందన్నారు. పార్కు మూసివేసిన తర్వాత కూడా ప్రహరీలో దెబ్బతిన్న భాగాల గుండా కొందరు లోపలికి ప్రవేశించి కాలక్షేపం చేస్తున్నారని, వెనుక వైపు ఉన్న అదనపు ప్రవేశ ద్వారాల కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం కలుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ అవార్డులు పొందిన ఈ పార్కులో భద్రతను పటిష్ఠం చేయాలంటే ప్రధానంగా రెండు ప్రవేశ ద్వారాలనే వినియోగంలో ఉంచి, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని సూచించారు. నగరంలో పశువుల సంచారాన్ని అరికట్టడంలో అధికారులు విఫలమవడంతో పార్కులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, రహదారులు పశువులకు ఆశ్రయాలుగా మారుతున్నాయని విమర్శించారు. వివేకానంద పార్కులో నెలకొన్న సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి భద్రత, నిర్వహణ, పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# భారత జట్టులో భారీ మార్పులు.. ఏడుగురు ఔట్, ఆరుగురు కొత్తవారికి ఛాన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన తర్వాత రేపటి నుంచి టీమిండియా క్రికెట్ జట్టు మరో విదేశీ పర్యటనకు సిద్ధమైంది. జింబాబ్వేతో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇండియా తలపడనుంది. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు జూలై 23 నుంచి జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలోనే జరగనున్నాయి. కెప్టెన్‌గా టీ20ల్లో తొలి విజయం కోసం వేచి చూస్తున్న శ్రేయస్ అయ్యర్ భారత జట్టుని ముందుకు నడిపించనున్నాడు. ఈ జట్టులో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ లాంటి ప్లేయర్స్ కి ఛాన్స్ దక్కింది. 2026లో ఆడుతున్న మూడో విదేశీ టీ20 సిరీస్ కోసం సెలెక్టర్లు జట్టులో భారీ మార్పులు చేశారు.

**జట్టులోకి వచ్చిన ఆటగాళ్లు:**

రింకూ సింగ్, మయాంక్ యాదవ్: జింబాబ్వే జరగబోయే టీ20 సిరీస్ కోసం భారత జట్టు ప్రకటించిన జాబితాలో స్టార్ ఆటగాడు రింకూ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అలాగే గాయాలతో చాన్నాళ్లుగా టీమ్ కి దూరమైన పేసర్ మయాంక్ యాదవ్ రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు.

అరంగేట్రం చేయబోతున్న కొత్తవారు: ఇప్పటి వరకు జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేయని యువ బౌలర్లు అశోక్ శర్మ, యష్ ఠాకూర్ ఈ సిరీస్ కోసం తొలిసారి బీసీసీఐ నుంచి పిలుపువచ్చింది.

హర్ష్ దూబే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్: వన్డేలు ఆడిన విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబేకి కూడా తొలిసారి టీ20ల్లో ఆడేందుకు కాల్ వచ్చింది. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున అత్యధిక రన్స్ చేసిన వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

**జట్టుకు దూరమైన ప్లేయర్స్:**

సంజూ శాంసన్ పై వేటు: ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను సెలెక్టర్లు ఈ సిరీస్ కి పక్కనబెట్టారు. ఈ నిర్ణయంపై అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీపై ఫ్యాన్స్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

పేసర్లు, ఆల్‌రౌండర్లు: అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాలతో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు ఈ సిరీస్‌లో రెస్ట్ ఇచ్చారు.

వరుణ్ చక్రవర్తి గాయం: తొలుత బీసీసీఐ ప్రకటించిన జట్టులో ఉన్న స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో గాయపడటంతో ఈ సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతని స్థానంలో రవి బిష్ణోయ్‌ను మళ్లీ తుది జట్టులోకి తీసుకున్నారు.

**జట్టులో స్థానం పదిలం చేసుకున్న ఆటగాళ్లు వీళ్లే:**

ఇంగ్లాండ్ సిరీస్ ఆడిన జట్టు నుంచి శ్రేయస్ అయ్యర్, వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్ తమ స్థానాలను ఫిక్స్ చేసుకున్నారు.

**జింబాబ్వేతో టీ20 సిరీస్‌కి భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

# భారత్ vs జింబాబ్వే టీ20 రికార్డ్స్.. అత్యధిక పరుగులు, వికెట్లు, సిక్సర్లు ఎవరివంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు, జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ20 (ట20×) సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్ రేపు (గురువారం, జూలై 23న) హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరుగుతుంది. అదే మైదానంలో శనివారం (జూలై 25న) రెండవ టీ20, ఆదివారం (జూలై 26న) మూడవ టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ హోమ్ సిరీస్ కోసం జింబాబ్వే ఈరోజు (బుధవారం) తమ జట్టును ప్రకటించింది. స్టార్ ఆల్‌రౌండర్ సికందర్ రజాను జట్టులో కొనసాగించింది. జింబాబ్వే తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రజా, బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించి సొంత ఫ్యాన్స్ ముందు భారత్‌ను ఓడించి సిరీస్ గెలవాలని చూస్తున్నాడు.

**తొలి విజయం కోసం శ్రేయస్ వెయిటింగ్:**

భారత టీ20 కెప్టెన్‌గా తన తొలి సిరీస్ విజయాన్ని అందుకోవాలని శ్రేయస్ అయ్యర్ పట్టుదలతో ఉన్నాడు. అతను ఇప్పటి వరకు భారత్‌కు 8 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా, అందులో 7 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదురైంది. సెలెక్టర్లు ఈ పర్యటనకు బలమైన బ్యాటింగ్ రంగాన్ని ఎంపిక చేయగా, బౌలింగ్‌లో కొందరు ఇంకా అరంగేట్రం చేయని (అన్‌క్యాప్‌డ్) బౌలర్లు ఉన్నారు. భారత్ చివరిసారిగా ఫిబ్రవరి 2026లో జరిగిన టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో జింబాబ్వేతో ఆడింది. అంతకుముందు జూలై 2024లో జింబాబ్వేలో పర్యటించిన భారత్, శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడిన 5 టీ20ల సిరీస్‌లో 4 మ్యాచ్‌లను గెలుచుకుంది.

**భారత్ – జింబాబ్వే టి20 మ్యాచ్‌ల రికార్డులు:**

అత్యధిక విజయాలు: భారత్ – 14 మ్యాచ్‌ల్లో 11 విజయాలు.

అత్యధిక స్కోరు: భారత్ – 256/4 (20 ఓవర్లలో), చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో (ఫిబ్రవరి 26, 2026).

అత్యల్ప స్కోరు: జింబాబ్వే– 99/9 (20 ఓవర్లలో), హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో (జూన్ 20, 2016).

రన్స్ పరంగా పెద్ద విజయం: భారత్ 100 పరుగుల తేడాతో విజయం (లక్ష్యం: 235) – హరారేలో (జూలై 7, 2024).

వికెట్ల పరంగా పెద్ద విజయం: భారత్ 10 వికెట్ల తేడాతో విజయం (లక్ష్యం: 153) – హరారేలో (జూలై 13, 2024).

పరుగుల పరంగా చిన్న విజయం: జింబాబ్వే 2 పరుగుల తేడాతో విజయం (లక్ష్యం: 171) హరారేలో (జూన్ 18, 2016).

వికెట్ల పరంగా చిన్న విజయం: భారత్ 6 వికెట్ల తేడాతో విజయం (లక్ష్యం: 112) – హరారేలో (జూన్ 12, 2010).

**ఆటగాళ్ల రికార్డులు:**

అత్యధిక పరుగులు: సికందర్ రజా (జింబాబ్వే) –11 మ్యాచ్‌ల్లో 194 రన్స్.

అత్యధిక వ్యక్తిగత స్కోరు: అభిషేక్ శర్మ (భారత్) – 47 బంతుల్లో 100 పరుగులు, హరారేలో (జూలై 7, 2024).

అత్యుత్తమ సగటు (కనీసం 5 ఇన్నింగ్స్‌లు): శుభ్‌మన్ గిల్ (భారత్) – 42.50 (5 మ్యాచ్‌ల్లో 170 పరుగులు).

అత్యుత్తమ స్ట్రైక్ రేట్ (కనీసం 50 బంతులు): అభిషేక్ శర్మ (భారత్) – 177.22 (6 మ్యాచ్‌ల్లో 179 పరుగులు).

అత్యధిక సెంచరీలు: అభిషేక్ శర్మ (భారత్) – 1.

అత్యధిక హాఫ్ సెంచరీలు: శుభ్‌మన్ గిల్ (భారత్) – 2.

అత్యధిక డకౌట్లు: మనీష్ పాండే (భారత్), వెస్లీ మాధెవెరె (జింబాబ్వే) – తలో 2 సార్లు.

అత్యధిక సిక్సర్లు: అభిషేక్ శర్మ (భారత్) – 6 మ్యాచ్‌ల్లో 13 సిక్సర్లు.

ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులు: శుభ్‌మన్ గిల్ (భారత్) – జూలై 2024 పర్యటనలో 5 మ్యాచ్‌ల్లో 170 పరుగులు.

అత్యధిక వికెట్లు: ముకేష్ కుమార్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ (భారత్), సికందర్ రజా, బ్లెస్సింగ్ ముజరబానీ (జింబాబ్వే) – తలో 8 వికెట్లు.

అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు: బరీందర్ శరణ్ (భారత్) – 4/10 (4 ఓవర్లలో), హరారేలో (జూన్ 20, 2016).

ఒకే సిరీస్‌లో అత్యధిక వికెట్లు: ముకేష్ కుమార్ (భారత్) – జూలై 2024 పర్యటనలో 3 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు.

అత్యధిక డిస్మిసల్స్: సంజూ శాంసన్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 3 డిస్మిసల్స్ (3 క్యాచ్‌లు).

అత్యధిక క్యాచ్‌లు: రింకూ సింగ్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 6 క్యాచ్‌లు.

అత్యుత్తమ భాగస్వామ్యం: శుభ్‌మన్ గిల్ అండ్ యశస్వి జైస్వాల్ (భారత్) – మొదటి వికెట్‌కు 156 రన్స్ (జూలై 13, 2024).

అత్యధిక మ్యాచ్‌లు: సికందర్ రజా (జింబాబ్వే) – 11 మ్యాచ్‌లు.

లి కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు: సికందర్ రజా (జింబాబ్వే) – 7 మ్యాచ్‌లు.

లి కెప్టెన్‌గా అత్యధిక విజయాలు: శుభ్‌మన్ గిల్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.

# విప్లవ పథం: నక్సలైట్ పాత్రల్లో మెప్పించిన టాప్-5 కథానాయికలు

తెలుగు చిత్రసీమలో నాయిక ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తుపాకీ చేతబట్టి విప్లవ పోరాటాలు చేసే నక్సలైట్ పాత్రల్లో నటించి మెప్పించడం ప్రతి నటికి ఒక గొప్ప సవాలు. విప్లవ భావజాలాన్ని, భావోద్వేగాలను పండించి నక్సల్స్ పాత్రల్లో






అలరించిన కథానాయికల వైపు దర్శకులు, ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తి చూపుతూనే ఉన్నారు. ఈ తరహా పాత్రల్లో మెప్పించిన మేటి నటిగా లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలో ఈ సీనియర్ నటి పోషించిన రాములమ్మ పాత్ర తెలుగు సినిమా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. దొరల అన్యాయాలకు వ్యతిరేకంగా అడవి బాట పట్టి నక్సలైట్‌గా మారిన పాత్రలో విజయశాంతి చూపించిన రౌద్రం.. పవర్‌ఫుల్ నటన ప్రేక్షకులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాగే సహజనటి జయసుధ కూడా గతంలో 'మహా సంగ్రామం' వంటి చిత్రాలలో నక్సలైట్ తరహా పాత్రను అత్యంత హుందాతనంతో భావోద్వేగాలను పండించి తన నటనా ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక ప్రస్తుత తరం హీరోయిన్లలో సాయి పల్లవి 'విరాటపర్వం' సినిమాలో 'వెన్నెల'గా నక్సలైట్ కథాంశంలో జీవించారు. కామ్రేడ్ రవన్న భావజాలానికి ఆకర్షితురాలై... ప్రేమ కోసం అడవి బాట పట్టిన అమాయకపు పల్లెటూరి అమ్మాయిగా సాయి పల్లవి కనబరిచిన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే విడుదలైన 'మాఇంటి బంగారం' చిత్రంలో సమంత కూడా నక్సలైట్ నేపథ్య డైనమిక్ పాత్రలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. అలాగే రష్మిక మందన్న 'మైసా' చిత్రంలో కట్టుబొట్టు మార్చి రౌద్ర రూపంతో కూడిన విప్లవాత్మక పాత్రను పోషించడం ఈ ట్రెండ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.కేవలం అగ్ర కథానాయికలే కాకుండా.. టాలీవుడ్‌లో వచ్చిన పలు పరిమిత బడ్జెట్.. కంటెంట్ బేస్డ్ సినిమాల్లో కూడా నటీమణులు నక్సలైట్ పాత్రల్లో అద్భుతంగా రాణించారు. అప్పట్లో ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన 'ఎర్రసైన్యం', 'ఎన్‌కౌంటర్' వంటి చిత్రాల్లో విప్లవ నాయకిలుగా నటించిన నటీమణులు పల్లెటూరి ప్రజల ఆక్రందనలకు చలించి విప్లవ పోరాటాల బాట పట్టే ప్రజా యోధులుగా నటించారు. అటు బాలీవుడ్‌లో 'హజారోన్ ఖ్వాయిషేన్ ఐసీ' చిత్రంలో చిత్రంగద సింగ్... కోలీవుడ్‌లో ప్రకాష్ రాజ్ దర్శకత్వం వహించిన 'కంజీవరమ్' లో.. పలు తమిళ రాజకీయ–విప్లవ సినిమాల్లో సౌత్ కథానాయికలు నక్సల్స్ గానో.. తిరుగుబాటుదారుల పాత్రల్లోనో నటించి మెప్పించారు.ప్రజా యుద్ధనౌక, విప్లవ చిత్రాల పితామహుడు ఆర్. నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఎర్రసైన్యం చిత్రంలో యాంకర్ ఉదయభాను నక్సలైట్ గా అద్భుతంగా నటించి మెప్పించారు. ఆయన తెరకెక్కించిన చీమలదండు, దళం, ఒకే ఒక్కడు, లాల్ సలామ్ వంటి చిత్రాలలో నక్సలైట్లుగా .. విప్లవ పోరాట నాయికలుగా నటీమణులు అత్యంత సహజమైన అభినయంతో మెప్పించారు. రొటీన్ కమర్షియల్ హంగులకు దూరంగా... పచ్చటి అడవుల నేపథ్యంలో తుపాకీ చేతబట్టి... సమాజంలోని దౌర్జన్యాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే పాత్రల్లో కథానాయికలు కనిపించారు.




Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965